"ఇరవై పైసలు చిల్లరుందా?"

కుంటి బిచ్చగాడు జాగ్రత్తగా సత్తు గిన్నెని రెండు మొండి చేతుల మధ్యా ఇరికించి పట్టుకుని కదించ సాగాడు. [illegible] ఉన్న చిల్లర నాణాలన్నీ సర్దుకున్నాయి శబ్దం పెట్టడానికి అనువుగా.

"పదిహేడు పైసలుంది, బాబూ!"

"సరే పో, నీ అదృష్టం" అంటూ ఇరవై పైసల బిళ్ళ వాడి చేతిలో వదిలి చిల్లర పుచ్చుకుని చుట్టూ కలియ చూశాడు సోమరాజు—భూరి విరాళం ఇచ్చిన వదాన్యుడని కనిపెట్టిన ఎవరి మొహంలో నైనా తనకి ప్రశంసాపూర్వకమైన కాంప్లిమెంట్సు కనిపిస్తాయేమో నని. కాని, బస్సులో ఒక్కరూ అతని కేసి కన్నెత్తి అయినా చూడలేదు—ఒక్క పంతొమ్మిదో నంబరు సీట్లో ఉన్న 'సోషలిస్టు' తప్ప. తను రాజకీయ సోషలిస్టుని కాదని, కేవలం సాంఘిక సోషలిస్టుని మాత్రమేనని, సమాజం లోని అంతరాలు సరిచెయ్యడమే తన ప్రధాన వాంఛితం అని అతను అడిగిన వారికీ, అడగని వారికీ ఒకే రకంగా చెబుతూం టాడు.

'వెయ్యరా నాయనా, వెయ్. ముష్టి మూడు పైసలకే గొప్ప ఘనకార్యం చేసిన వాడికిమల్లే మొహం పెట్టకు. నీ పాపాన్ని ఈ కాస్త డబ్బు ఎలాగూ కడగ లేదులే' అనుకున్నాడు సోషలిస్టు తనలో.

"అనాథోణ్ణి, బాబయ్యా! చేతులు లేని అవిటి బతుకు, నాయనా! మీ లాంటి ధరమ తల్లిదండ్రులు. దానం సెయ్యాల, మేం బతకాల. బాబులారా! సేసిన ధరమం సెడని పదార్థం, తండ్రు లారా!" అంటూ అరుస్తూ సీటు సీటుకీ సాగిపోతున్నాడు వాడు.

". . .సిలకా గోరింకల్లాగున్నారు, బాబయ్యా! తమరిద్దరూ వెయ్యేళ్ళు సుకంగా ఉండాల, పండంటి కొడుకు నెత్తుకోవాల. నువ్వైనా చెప్పు, తల్లీ!"

మూడవ సీటులో కిటికీ దగ్గర ముడుచుకుని కూర్చున్న అమ్మాయి కిసుక్కున నవ్వింది.

"ఓ అయిదు పైసలు పారెయ్యండి. పాపం, కుంటాడు."

"అచ్చొచ్చో! పాపం, ఇంతకీ ఇదంతా ఆ కుంటాడి మీద జాలా? లేక. . చంటాడి మీద గాలా?" అంటూ అమ్మాయికేసి తిరిగాడు అతగాడు—ఆ అమ్మాయి బుగ్గల్లో ఇప్పుడు గులాబీలు పూయాలి కాబట్టి వాటి నేరుకుందామని.

ఆ అమ్మాయి కిటికీ లోంచి బయటికి ఏదో వింత చూస్తున్నది.

"ఏం? డైలాగు బాగా లేదా? సినిమా లకి పనికిరాదా?" అంటూ మళ్ళీ ఇంకో జోకేశాడు.



ఎమ్. హెచ్. వి. సుబ్బారావు

"ఉహూ! ఎంత మాత్రం పనికిరాదు. ఒక్క రైమ్ ఉంటే సరిపోతుందేమిటి? రెండో అర్థం ఏదీ చూపించండి చూద్దాం—మీ డైలాగుల్లో" అంది అమ్మాయి.

"పోయింటే. పోతే పోన్లెద్దూ, వెధవ సినిమాఫాస్టు. సువ్వెంచక్కా బాత్‌రూంలో లాగు లుతుకుతూండు. నేను బయట డైలాగు లుతుకుతూంటాను. లేకపోతే వేమో... ఏరేమో... ఏరేమో..." అంటూ కొంచెం కొంచెం దగ్గరికి జరుగుతూ ప్రారంభించాడు.

"ష్! ఆఁ! ఆఁ! గో బాక్. సమయం రావాలి."

"అనగా బస్సు కదలాలి. డ్రైవర్ లైట్లు తీసేయాలి. అంతే కదూ? ఆల్ రైట్! ఒప్పుకున్నాం. గుడ్ నైట్ ఎండ్ గుడ్‌బై టు యు అప్టు సూర్యాపేట్!"

"అబ్బ! ఆశ! సమయం అనగా వైశాఖ బహుళ ఏకాదశి... గురువారం."

"ఆహాఁ! అలాగేం! ఆ రోజు ఏం జరుగుతుందేమిటి?"

హఠాత్తుగా అమ్మాయికి తెలివి వచ్చేసింది. తనేం మాట్లాడుతూందో తెలుసుకుని మరింత ముడుచుకుని పోయింది. అబ్బాయి మరింత దగ్గరగా జరిగాడు.

"ఓహో! నువ్వు మాట్లాడకుండా కూర్చుంటే నేను చెప్పలేనేమిటి? శ్రీశ్రీశ్రీ ఫలానా అబ్బాయిగారికీన్నీ, మరిన్నీ శ్రీమతి అమ్మాయిగారికీన్నీ వివాహ శుభముహూర్తమున పునస్సుం..."

గబుక్కున అమ్మాయి అతని నోరు చేత్తో మూసేసింది మృదువుగా. "ఛీ ఛీ! మీకు మరీ బొత్తిగా సిగ్గు లేకుండా పోతూంది. ఇది బస్సు అని గుర్తుంచుకోండి" అంటూ.

"బాబూ!" అన్నాడు స్వైనలు రికమెండ్ చేసిన అమ్మగారి అసలా దగాకుని ధైర్యం చేశాడు కుంటి బిచ్చగాడు.

"ఛట్, వెధవా! ఇంకా ఇక్కడే వేలాడుతున్నావా? లేదంటే కుదో సీటుకి తగలడకూడదూ?... ఛీ ఛీ! వెధవ న్యూసెన్సు" అంటూ విదిలించి కొట్టాడు అబ్బాయి.

అమ్మాయి ఏమీ మాట్లాడలేదు. ఆమె చూపులు మాత్రం భర్తతో సంపూర్ణ అంగీకారాన్ని సూచించాయి.

బాధం దేబిరించుకుని ముందుకి కదిలాడు కుంటి బిచ్చగాడు.

'దుర్మార్గుడా! నీ పెళ్ళాంతో సరసాలాడుకుంటూ వాడి సంత నేను వినిపించక పోతే వెంటనే పిచ్చుని చెప్పగూడదూ?' అనుకున్నాడు సోమరిస్సి. అంతేకాక వాడు తన దగ్గరికొచ్చినప్పుడు ఓ పావలా వేద్దామని అనుకున్నాడు.

వెనకాల సీట్లో ఇద్దరు స్టూడెంట్లు కూర్చున్నారు.

"పిక్చర్ అంటే 'జరూరత్' రా. అబ్బ! ఏమేసాడనుకో. ఛ... అదెవతోగాని, ఒరే, ఏం చూపించేసిందనుకున్నావ్? చెప్ప లేని సను ఐదు నిమిషాలయినా ఉంటే నువ్వు చచ్చిపోయేంత ఒట్టు" అంటున్నాడు ఒకడు.

"ఏడిశావ్ లేవోయ్, ఇంగ్లీషు సినిమాలతో పోలిస్తే ఇదేపాటి? 'వరల్డ్ బై నైట్ సంబర్ టూ' నువ్వు చూడలేదేమో" అంటున్నాడు రెండవ వాడు.

"నీ మొహం. అందులో ఏముందిరా? తీరా అసలు సీనొచ్చేసరికి తెరచాటుకి తీసుకెళ్ళి నీడలు చూపెడతారు. 'జరూరత్' అలాగా? నీ ఖర్మలే, ఎవరేం చెయ్యగలరు?" అన్నాడు మొదటివాడు.

"మధ్యాహ్నం మరి సింపుల్ బ్రాకెట్స్ గాడి క్లాసులో అటెండెన్స్ చెబుతావా?" అన్నాడు రెండోవాడు. 'వరల్డ్ బై నైట్ సంబర్ టూ' ని మించిన సెక్స్ ఆ 'జరూరత్'లో ఏముందో చూడాలనే కోరిక ఆ కొద్ది నిమిషాల్లోనే అతనిలో మొలకెత్తి, పెరిగి పెద్దదై వేళ్ళు తొడుకుంది.

"చెబుతావా ఏమిట్రా నీ బొంద—చెప్పు అను. నీకు కాకపోతే ఇంకెవరికి చెబుతాను? అందులోనూ 'ప్రాక్సీ' చెప్పడంలో మన ప్రజ్ఞ నీకు తెలుసుగా? మొన్న అరవిందకి అటెండెన్సు చెప్పినా తెలుసుకోలేకపోయాడు ఆ 'షేడ్ బ్రాకెట్స్' గాడు."

ఇద్దరూ నవ్వుకున్నారు. 'సింపుల్ బ్రాకెట్స్' అనబడే శాస్త్రి బయాలజీ లెక్చరరు. పాపం ఆయనకి పూర్వపుణ్య విశేషాన దొడ్డికాళ్ళు సంప్రాప్తించాయి. 'షేడ్ బ్రాకెట్స్' అని సొంతంగా పేరుపెట్టుకున్ బడ్డ ఆ గురువరేణ్యుడు తెలుగు డిపార్ట్‌మెంట్‌కు చెందిన శ్రీ అన్నంభొట్ల లక్ష్మీనారాయణశాస్త్రి గారు.

ఆ రోజు అతను 'అరవింద' కి కీముగొంతుక పెట్టి ఎలా ప్రాక్సీ చెప్పాడో, పాఠం తప్ప మరో లోకం ఎరగని శాస్త్రి గారు అది గమనించలేక ఎలా నంబర్లు పిలుచుకుంటూ పోయారో, తరవాత ఈ సంగతి తెలుసుకున్న అరవింద ఎలా కరుణా కటాక్ష వీక్షణం ఒకటి అలా అలవోకగా పారేసిందో తలుచుకుని తన్మయత్వంతో మునిగి ఇంకా తేలేదు స్నేహితులిద్దరూ.

"బాబూ! చేతుల్లేనోణ్ణి, బాబూ! దానం చెయ్యండి, మహారాజా!" అంటూ వచ్చాడు కుంటి బిచ్చగాడు.

"ఒరే, నీ చేతులెలా పోయాయిరా?" అంటూ అడిగాడు వాళ్ళలో ఒకడు.

"చేతుల మీదినించి లారీ పోయింది, బాబూ!"

"అదెలాగులోయ్?"


"ఒకరోజున రోడ్డు పక్కన సిమెంటు సపటామీద పడుకొని నిద్దర పోతుండా, బాబూ, నేను. నిద్దట్లో చెయ్యి కింద రోడ్డు మీద కొచ్చేసినాదిగామాల నాకు తెల్దు తెల్దు, బాబూ! ఏదో అడ్డం వస్తే తప్పించటానికి లారీ సడన్‌గా కోసినాడు. కొంచెం ఉంటే లారీ సరవా మీదెక్కి పచ్చి పోవాల్సి నోళ్ళం, అయ్యా!" అంటూ విప్పువించుకున్నాడు.

"వెధవా! బాగా అయింది. లేకపోతే ఒర్దారాత్రి ... దేనికి పడి నిద్దర పోతున్నావురా? బాగా తాగి పడున్నావా?"

"అదేంది, బాబూ, అట్టాగంటారు? నేం ఉండేదే ఆడ. నే నొక్కణ్ణే ఆడ బదుండా ననుకున్నా రేంది, బాబో? నేనూ, నా యాడోళ్ళూ, మా నలుగురు పిల్లలూ—అందరం ఆడే తొంగున్నాం, బాబూ! పదేళ్ళ బట్టీ ఆడ కాపరం ఉంటుండాం, మా యాడోళ్ళు ఆడే పిల్లల్ని కన్నది నా కండవా అడ్డం కట్టుకోని—ఎప్పుడైనా అయిందా బాబూ, ఇట్టా. కరమ. ఇంతకీ కరమ, బాబూ!"

తప్పతాగి లారీ మీద కెక్కించిన లారీ డ్రైవరు మీద వాడికి కోపమూ లేదు. కర్మ సిద్ధాంతం వాడి నరాల్లో జీర్ణించి పోయింది.

"ఇటువంటి దయనీయమైన సంఘటనలు జీవితంలో ఉంచుకుని మన వాళ్ళు ఎంత సేపూ పారమ్మలా పిక్చర్లే ఎందుకు తీస్తారో అర్థం కాదు. ఇతని జీవితం ఎంత మంచి థీమ్ అవుతుందిం అంటారు? ఆ మాత్రం మన వాళ్ళు ఆలోచించరెందుకో! అదే సత్యజిత్‌రాయ్ చూడండి. అందుకే అతను కాన్స్ ఫెస్టివల్‌కి వెళ్ళినా, కాన్స్ పారిస్కో వెళ్ళినా ఇంటికొచ్చి పోల్చాలో ఈ దడ చేసినదిక దొర్లింతా మెడల్స్. ఇంతకీ వినాలు 'సకేర



హించాలో చూశారా?" అన్నాడు నాలుగేళ్ళ క్రితం కాలేజీ వదిలి కొత్తగా ఉద్యోగంలో జాయిన్ అయిన ఓ 'చిరుద్యోగి' వెనక సీట్లోంచి.

"అందులో జ్యోతిలక్ష్మి ఉందా?" అని అడుగుదామనుకున్నాడు రెండవ విద్యార్థి. కాని, మరీ బాగుండదని, "అవును, సార్. . . హావునవును, సార్" అన్నాడు.

చిరుద్యోగి తన బాధ్యత తీరిపోయినట్టు మళ్ళీ కిటికీలోంచి బయటకు చూడ్డం ప్రారంభించాడు.

స్నేహితులిద్దరూ మళ్ళీ కబుర్లలో పడిపోయారు.

"బాబూ . . ." అన్నాడు బిచ్చగాడు.

"అవున్రా. మరి నీ పెళ్ళాం పిల్లల్ని కూడా తీసుకొస్తే ఇంకా ఎక్కువ దొరికేది కదా?" అన్నాడు మొదటి విద్యార్థి.

"వాళ్ళూ ఉన్నారు, బాబూ! మా యాడోళ్ళకి ఇయాల రైలు టేసనిలో డూటీ. నా కొడుకుటేస్నెమో హోటలుకాడ కూకోమని సెప్పినయ్యా. సిన్నోడసలు తిరగలేడు."

"అందరూ ఒక చోటే అడుక్కో గూడదా?"

"బాగానే ఉంటది గాని, బాబయ్యా, అందర్నీ ఒకేసారి చూస్తే పోలీసోడి కన్ను కుడద్ది, బాబయ్యా! ఇప్పటికే తిడుతుంటాడు, బాబూ! 'ఏరా, నా కొడకా! కుంటాణ్ణి, కుంటాణ్ణంటూ బాగా సంపాదించి కళ్ళు నెత్తికెక్కాయిరా నీకు. మే మెట్లా కనబడతాం?' అంటూంటాడు. . . బాబూ! దరమం. . ." అంటూ మళ్ళీ గుర్తు చేశాను వాడు.

"మేం ప్రయాణికులం కాదోయ్. బస్సులో ప్రయాణికుల దగ్గరే అడుక్కోవాలి. కావాలంటే మేం కిందికి దిగాక అడుగు. అప్పుడు లేదంటాం" అన్నాడు మొదటి విద్యార్థి. రెండవ విద్యార్థి అదేదో బ్రహ్మాండమైన జోకన్నట్టు, విరగబడి నవ్వడం ప్రారంభించాడు.

'వెధవల్లారా! వాడితో పక్కా గంట వాగించి ఇవా మీ తెలివితేటలు! మీరా నవభారత నిర్మాతలు!' అని తిట్టుకున్నాడు సోషలిస్టు. బిచ్చగాడు తన దగ్గరి కొచ్చినప్పుడు అర్ధరూపాయి ఇద్దామని కూడా నిర్ణయించుకున్నాడు.

"బాబూ! దరమం. అయ్యా! దానం" అంటూ ముందుకు సాగాడు బిచ్చగాడు. వాడికికూడా ఫుల్ ఎనౌన్స్‌మెంట్ చెయ్యడం విసుగు పుడుతున్నట్లున్నది.

కుడివేపు త్రీ సీటర్‌లో ఒక మూటు వేసుకున్న 'గురుద్యోగి' కి దురదృష్ట వశాత్తు చివరి సీటు దొరికింది. బిచ్చగాడు మరీ మీది మీదికి తోసుకుంటూ



బోసి బాబు — ఫోటో — కె. వి. రామమోహనరావు (భువనేశ్వర్)

రావడం, తనకి తగలడం ఆయనకి బొత్తిగా ఇష్టం లేదు. అందుకే మొహం చిట్లించుకుని ఒడుక్కుని నరాలన్నీ కూడ లాక్కుని కూర్చున్నాడు.

బిచ్చగాడు ఆయన ముక్కుకి సరిగ్గా మూడంగుళాల దూరంలో చెయ్యి పెట్టి, "దరమం, బాబూ" అన్నాడు.

"వెళ్ళు. వెళ్ళు. లేదు. వెళ్ళు వెళ్ళు" అన్నాడాయన చిరాగ్గా.

బిచ్చగాడు కదల లేదు.

"వెళ్ళరా—చెప్పేది నీ క్కాదూ?" అని కసురుకున్నాడు.

"దీస్ బెగ్గర్స్ హావ్ బికమ్ ఎ న్యూసెన్స్ అండీ!" అన్నాడు ముందు సీట్లో కూర్చున్న 'చిరుద్యోగి'తో.

"హ హ! అవున్సార్" అన్నాడతను.

"యూ సీ ఇన్ హర్యానా? హర్యానాలో చూడండి. దే హావ్ బాన్‌డ్ బెగ్గింగ్. అడుక్కుతినడం నిషేధించారు. మన వాళ్ళూ అలాగే చేయాలండీ. అదర్ పీపుల్ ఆల్‌సో మస్ట్ డూ దైర్ డ్యూటీ అండీ! నాట్ దట్ వియ్ లూజ్ బై గివింగ్ దెమ్ ఫైవ్ ఆర్ టెన్ పైసే. వాళ్ళకి అయిదు పైసలో, పది పైసలో వేస్తే మన దేదో పోతుందని కాదు. వియ్ షుడ్ నాట్ ఎంకరేజ్ బెగ్గింగ్. అడుక్కు తినడం ప్రోత్సహించ రాదు" అని ఒక్క బిగిని చెప్పేశాడు. సీట్లో కొంచెం సర్దుక్కూర్చుని ముందుకు వంగి ఉద్రేకం కొంచెం తగ్గిందేమో అచ్చ తెలుగులో ప్రారంభించాడు.

"ఓ సారేమైందనుకున్నారు? ప్రతి శనివారం చిక్కడపల్లి గుడికి వెళ్ళడం నా కలవాటు లెండి. ఓ రోజు అయినా సరదాగా చూద్దామని ఓ రూపాయివి రెండు పైసల బిళ్ళలు తీసుకుని అందరు బిచ్చగాళ్ళకీ పంచి పెట్టాలనుకున్నాను. అక్కడ చూస్తే మొదట పాతిక మంది కన్నా లేరు. తీరా వెయ్యడం ప్రారంభించే సరికి పుట్టలోంచి పుసిళ్ళు వచ్చినట్లుగా వందలమంది చుట్టూ గుమి గూడేశారు. దెన్ ఐ హావ్ టు సెండ్ మై ప్యూన్ ఎండ్ సీక్ ది ఎయిడ్ ఆఫ్ ది పోలీసు టు క్లియర్ మై సెల్ఫ్ అవుట్ ఆఫ్ ది క్రౌడ్. గుంపులోంచి బయట పడ్డానికి ప్యూన్‌ని పంపి పోలీసుల్ని పిలిపించుకోవలసి వచ్చింది. అప్పట్నుంచి బెగ్గర్స్ అంటే నా కసహ్యం. అంతకు మించిన న్యూసెన్స్ ఈ ప్రపంచంలో మరొకటేదీ ఉండదని దృఢ విశ్వాసం ఏర్పడింది" అంటూ ఆగిపోయాడు.

"మరేనండీ" అంటూ నాన్చేశాడు చిరుద్యోగి.

'అవున్రా, నీకు మనుషులు పుసిళ్ళు లాగే కనిపిస్తారు. దేవుడి గుడికి కొబ్బరి కాయలుకూడా ఆఫీస్‌ప్యూన్‌తో మోయించి పట్టుకెళ్ళే నీకు న్యూసెన్సుగా ఉండక మరెలా ఉంటుంది? వాళ్ళ న్యూసెన్సు వదలడం గాదురా, మీకు న్యూసెన్సు వచ్చే రోజులు ఆట్టే దూరంలో లేవులే. తొందరపడకు' అంటూ గొణుక్కున్నాడు సోషలిస్టు. ఈ సారి బిచ్చగాడు తన సీటు దగ్గరి కొచ్చినప్పుడు ఒక రూపాయి ఇద్దామనికూడా తీర్మానించుకున్నాడు. వెధవది ఈ రోజుల్లో అయిదు పైసలకీ పది పైసలకీ ఏమొస్తాయి గనక?

అప్పటిదాకా దివ్య చక్షువులతో వెతికినా కనిపించని కండక్టరు హఠాత్తుగా నీలాకాశంలోంచి ఊడి పడ్డట్లుగానే బస్సులో ఎక్కి గణాగణా గంట కొట్టాడు. ఆఖరి దమ్ము గుండెల్నిండా పీల్చి బీడీ విసిరి పారేసి బస్సెక్కాడు డ్రైవరు.

"దిగు, దిగు. బస్ టైమయింది. దిగు" అంటూ అదిలించాడు కండక్టరు బిచ్చగాణ్ణి.

"పోతన్నా. పోతన్నా, బాబూ! అయ్యా దానం, బాబూ, దరమం. . ." ఆఖరి ఆశగా అరుస్తూన్నాడు. షావుకారిచ్చిన ఇరవై పైసల బిళ్ళ ఒక్కటే వాణ్ణి వెక్కిరిస్తూ కనబడ్డది సత్తుగిన్నెలో. గొంతుక పూడుక పోగా అరుస్తూ దిగుతున్నాడు వాడు.

వాడు తన సీటుకి దగ్గరవుతున్న కొద్దీ సోషలిస్టు నరాల్లో ఏదో ప్రకంపనం లాంటిది ప్రారంభమైంది. ఎంతయినా ఓ బిచ్చగాడికి ఒక రూపాయి—పూర్తి రూపాయి—ఇచ్చెయ్యడమా! ఆ రూపాయి—ఆ మాట కొస్తే చిల్లర కూడా లేక ఇబ్బంది పడ్డ రోజులు నెలాఖర్లో ఎన్నున్నాయో తనకి బాగా గుర్తు. ప్రయాణం అయి వెడుతున్నాడు గదా అని ఏదో నాలుగు రాళ్ళు తన జేబులో ఉన్నంత మాత్రాన తను గడిచి గట్టెక్కినట్టు కాదు. అందులో వెళ్ళేది మహాపట్నం. అక్కడ డబ్బుకి తనకి ఎంతయినా అవసరం రావచ్చు. ఛ, అర్థం లేదు. బిచ్చగాడికి రూపాయి ఇవ్వడం ఏమిటి? మామూలుగా ఓ అయిదు పైసలు, మహా అయితే పది పైసలు వేస్తే తప్పిపోతుంది.

జేబులోంచి పది పైసల నాణెం చేత్తో పట్టుకున్న సోషలిస్టు తల ఎత్తి చూశాడు. అప్పటికే బిచ్చగాడు బస్సు డోర్ దగ్గరికి వెళ్ళిపోయాడు. వెనక్కి పిలిచి వేస్తే ఏం బాగుంటుంది? బస్ టైమ్ అయిపోయింది. కండక్టరు విసుక్కుంటాడు. మిగతా ప్రయాణీకులంతా తనని వింతగా "బయలుదేరాడురా దీనజన బాంధవుడు" అన్నట్లుగా చూస్తారు.

"ఎందుకొచ్చిన న్యూసెన్సు" అంటూ మెల్లిగా తిరిగి డబ్బులు జేబులో జారవిడుచుకున్నాడు 'సోషలిస్టు.'